# యుద్ధకాండ

నవంబర్ 11వ తారీకు అమెరికాలో వెటరన్స్ డే జరిగింది. అంటే యుద్ధాల్లో పాల్గొన్నవారికి జేజేలు, చనిపోయిన వారికి శ్రద్ధాంజలి సమర్పించే రోజ న్నమాట. ఆరోజు పేపర్లోనూ రేడియోలోనూ టీవీలోనూ ఈ విషయం మీద చాల మంది వెటరన్స్‌తో ఇంటర్వ్యూలు, యుద్ధంలో వారి అనుభవాలూ మొదలైనవి ఒక పక్కా, ఇరాక్ యుద్ధం మీద అమెరికా ఖర్చు పెడుతున్న బిలియన్ల డాలర్ల మీద వ్యతిరేక ప్రసంగాలూ, రోజు రోజుకీ యుద్ధం కారణంగా అమెరికాలో పడిపోతున్న బుష్ రేటింగ్సు ఇంకొక పక్కా... ఎక్కడా చూసినా అవే. అదే రోజు మా ఇంటికి దగ్గరలో వున్న పోస్ట్ ఆఫీస్‌కి కొన్ని నెలల క్రితం ఇరాక్ యుద్ధంలో చనిపోయిన ఇరవై ఏళ్ళ కుర్రాడి పేరు పెట్టారు. ఆ కుర్రవాడి అక్క, మా ఆవిడకి ఆఫీసులో కొలీగ్. అతని అంత్యక్రియలకు తను వెళ్ళింది కూడాను. ఆరోజు ఈ వార్తలన్నీ వింటుంటే నా ఆలోచనలు అసలు యుద్ధాలు ఎందుకు చేస్తారు? ఎవరి కోసం? అనే చోట మొదలయి ఇంకా చాల దూరం పోయాయి.

శ్రీశ్రీగారు చెప్పినట్టు 'ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వ కారణం, నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం, రణరక్త ప్రవాహసిక్తం'. 'రణరంగం కాని చోటు భూస్థలమంతా వెదకిన దొరకదు, గతమంతా తడిసె రక్తమున, కాకుంటే కన్నీళ్ళతో'. ఈ కవితలు మళ్ళీ చదువుతుంటే ఎంత నిజమో అనిపించింది.

కొన్నేళ్ళ క్రితం బాపుగారు నాకు వ్రాసిన ఉత్తరంలో ఒక పిట్టకథ వ్రాశారు. నాకు ఇష్టమైన కథ అది. అశోకుడు గుర్రం మీద కత్తి డాలుతో వెడుతున్నాడుట. ఆయనకి ఎదురుగా వచ్చాడు ఒక బిచ్చగాడు. చక్రవర్తిని చూసి అతను అడిగాడు 'మీ రాజులకి వేరే పనేమీ లేదా? ఎప్పుడూ యుద్ధాలూ, మారణహోమాలూ తప్ప. నేనే రాజునయితే యుద్ధాలు చేసి ఇంతటి రక్తపాతాన్ని కలిగించివుండేవాణ్ణి కాదు' అన్నాడుట. దానికి అశోకుడు నవ్వి, 'నేనూ బిచ్చగాడిని అయుంటే అసలు యుద్ధం సంగతి నా ఆలోచనకే వచ్చివుండదు' అన్నాడుట.

నాణానికి రెండు పక్కలు వుంటాయి మరి!

అమెరికా ఇరాక్ మీదకి యుద్ధానికి ఎందుకు వెళ్ళింది అనే ప్రశ్న ఇతర దేశాల్లోనే కాదు, అమెరికాలోని సగం పైన జనాభాలోనూ వుంది. యుద్ధం మీద నిరసనలు రోజురోజుకీ ఎక్కువవుతూనే వున్నాయి. ప్రెసిడెంట్ బుష్ ఎప్రూవల్ రేటింగ్స్ రోజురోజుకీ పడిపోయి, ఇప్పుడు అమెరికా చరిత్రలోనే కనీవినీ ఎరుగనంత క్రిందకి అంటే 38 శాతంకి పడిపోయింది. అంటే పైన చెప్పిన పిట్టకథకీ దీనికీ ఏమయినా పొంతన వుందా? రాజులకీ ప్రెసిడెంట్లకీ వున్న లక్ష్యాలు ప్రజలకి వుండవా? మరి రాజులు నియంతలు కాబట్టి, యుద్ధకాంక్ష లేదా రాజ్య విస్తరణ

లేదా రాజ్య పరిరక్షణ- వాళ్ళ మారణహోమ రణరంగ లక్ష్యం ఏదన్నా కానీండి- కత్తులు దూసి ముందుకు దూకారు. మరి ప్రజాస్వామ్యంలో ప్రజలకి నచ్చనప్పుడు రాష్ట్రపతులూ ప్రధాన మంత్రులూ యుద్ధాలు ఎలా చేస్తున్నారు, ఎందుకు చేస్తున్నారు. అవి ప్రజలు ఒప్పుకుంటున్నారా? ఇవన్నీ మనందరికీ కొంచెం దీర్ఘంగా ఆలోచిస్తే జవాబులు తెలిసే ప్రశ్నలే!

ప్రతి యుద్ధానికీ, యుద్ధం చేసే వాళ్ళ దృష్టిలో కనీసం ఒకటన్నా కారణం వుంటుంది. ఆ కారణం మనలాటివారికి నిజమైన కారణంలా కనిపించదు. కొంత మంది ఆ కారణాన్నే నిజమైన కారణంగా నమ్మించి కాలు దువ్వితే, కొందరు కారణాల కోసం వెతికి దేన్నో ఒకదాన్ని పట్టుకున్నట్టు తెలుస్తూనే వుంటుంది. ఏది ఎలా చేసినా, కృష్ణుడు అర్జునుడికి చెప్పినట్టుగా యుద్ధం వాళ్ళకి అనివార్యం.

యుద్ధాలు రకరకాలు. నేను ధర్మయుద్ధాలూ అధర్మయుద్ధాలూ గురించి చెప్పటం లేదు. నా ఉద్దేశ్యంలో అన్నీ అధర్మ యుద్ధాలే. ఎందుకంటే నేను రాజునీ కాదు. దేశ నాయకుడినీ కాదు. పైన చెప్పిన బిచ్చగాడిలాటి మానవత్వాన్ని నమ్ముకునే మనిషిని. నాలాటి వారే మీలో ఎంతోమంది కూడాను. అందుకని మనకి అవి కారణాలుగా కనిపించక పోయినా, చరిత్రా పురాణాలూ చెప్పే కారణాలివి.

పాండవులకి కౌరవుల ద్రోహం కారణం. కౌరవులకి ద్రౌపతి నవ్వు కారణం. హిట్లర్‌కి జ్యూయిష్ మతం వారిని హతమార్చటం కారణం. అమెరికా, రష్యా, ఇంగ్లండ్‌లకి నియంతను హతమార్చటం కారణం. అమెరికా వాళ్ళకి ఆటంబాంబు వేయటానికి అదో కారణం అని కొందరంటారు. జపాను వాళ్ళకి హిరోషిమా, నాగసాకి నేల మట్టం అయేదాకా, హిట్లర్ని ఎందుకు సమర్థించారో వాళ్ళకే సరిగ్గా అంతుపట్టని కారణం. పాకిస్తానుకి హిందువులు కారణం. ఇండియాకి కాశ్మీరు కారణం. ఇద్దరికీ సరిహద్దులు కారణం. రష్యాకి అమెరికా ప్రజాస్వామ్యం కారణం. అమెరికాకి రష్యా కమ్యూనిజం కారణం. అలెగ్జాండర్‌కీ, చంగీజ్‌ఖాన్‌కీ, మహమ్మద్ గజనీకీ రాజ్యకాంక్ష కారణం. రోమన్ రాజ్య పతనానికి క్లియోపాత్రా కారణం. చైనాకి పక్కనే వున్న ఇండియా బర్మా టిబెట్ల మీద మోజు కారణం. అమెరికా యుద్ధాలకి కారణం, వాడి పిలకకీ వీడి పిలకకీ ముడిపెట్టి ఆయుధాలు అమ్ముకోటానికే అని కొందరి ఉద్దేశ్యం. కాదు ప్రపంచంలో ప్రజాస్వామ్యాన్ని నిలపటం కోసం అనేది అమెరికా చెప్పే కారణం. అలాగే రావణాసురుడికి సీతను ఎత్తుకుపోవటానికి, లక్ష్మణుడు తన చెల్లెలికి ముక్కులూ చెవులూ కోయటం కారణం. రాముడికి రావణాసురుడితో యుద్ధం చేయటానికి అతను సీతని ఎత్తుకుపోవటం కారణం. లవకుశులకి రాముడితో యుద్ధం చేయటానికి కారణం తమ తల్లికి రాముడు చేసిన అన్యాయం. ఇటు సామ్రాజ్య పాలన, అటు తననే నమ్ముకుని సర్వం త్యాగం చేసిన అర్థాంగి సీతల మధ్య, పదవినే కోరుకున్న రాముడి మీదే మరి ఎవరూ యుద్ధం చేయలేదు. ఇలా వ్రాసినందుకు కొందరు భక్తులు నా మీద యుద్ధం చేసినా చేయవచ్చు. రామాయణంలో సీత పాత్రకి రాముడి వల్ల జరిగిన అన్యాయమే నేనిలా రాయటానికి కారణం. ఇంగ్లాండ్ ఒకప్పుడు ప్రపంచంలో సగ భాగాన్ని ఇటు

కెనడానించీ, ఆఫ్రికా ఆసియా దేశాలలో ఇండియాతో సహా దుర్నాక్రమణ చేసింది. మధ్య దక్షిణ అమెరికాలను స్పెయిన్ ఆక్రమిస్తే, మేం తక్కువ తిన్నామా అని ఫ్రాన్స్ పోర్చుగీస్ యధాశక్తి ఎక్కడ ఏ దేశం కనపడితే దాన్ని ఆక్రమించుకున్నారు. వీటన్నిటికీ కారణమొక్కటే. పొరుగింటి పుల్లకూర రుచి. రుచి అయితే కొనుక్కోవచ్చు కానీ, ఆ పుల్లకూర పెరిగే చోటుని ఆక్రమించుకోవాలా అని మన లాటి వాళ్ళకి అనుమానం. పొరుగింటి పుల్లకూర కొంతమందికి రుచేమో కానీ కొంతమందికి ఆకలిని పెంచుతుంది. అందుకే ఇరుగు పొరుగు రాజ్యాలు ఒకళ్ళ నొకళ్ళు తింటూ కొట్టుకు చచ్చేది. ఇంగ్లాండు ఫ్రాన్సూ, ఇజ్రాయిల్ పాలస్తీనా, రెండు వియత్నాములూ, రెండు కొరియాలూ, చైనా తైవానులూ... ఇలా యుద్ధం చేసిన ప్రతి దేశానికీ, ప్రతి మనిషికీ కాకి ఎంగిలి కారణాలు వున్నాయి.

'అంతా తమ ప్రయోజకత్వం తామే భువి కధినాధులమని స్థాపించిన స్రామ్రాజ్యాలూ, నిర్మించిన కృత్రిమ చట్టాలూ ఇతరేతర శక్తులు లేస్తే పడిపోయెను పేక మేడలై'

యుద్ధమంటే నచ్చనివారు మరి యుద్ధంలో పాల్గొనే సైనికులని సమర్థిస్తారా అని ఇంకో ప్రశ్న తప్పకుండా. అదో ఉద్యోగం. ప్రతి సైనికుడూ తన దేశం పిలిస్తే యుద్ధానికి వెడతాడు. వెళ్ళాలి. ఇక్కడ నాకు తెలిసిన అమెరికన్ మిత్రుల్లో ఎంతోమంది వియత్నాం, ఇరాక్.. ఇలా రకరకాల యుద్ధాల్లో పాల్గొన్నవారే. ఇండియాలో మా చుట్టాల్లో ఎంతోమంది సైనికులూ ఆఫీసర్లూ వున్నారు. మళ్ళీ నాకు శ్రీశ్రీయే గుర్తొస్తున్నాడు. చరిత్రలో తాజ్ మహల్ కట్టిన షాజహానే కనిపిస్తాడు కానీ, దాన్ని కట్టిన కూలీలు కనపడరు. అలాగే యుద్ధంలో తమ ప్రాణాలు పణంగా పెట్టి వీరోచితంగా పోరాడిన సైనికులూ ఆఫీసర్లూ తెర వెనుక మనుష్యులే!

ఇలా యుద్ధాల గురించి ఆలోచిస్తుంటే ఏవేవో ఆలోచనలు ముసురు తున్నాయే కానీ తరగటం లేదు. కాకపోతే ఒక విషయం మనం గుర్తు పెట్టుకోవాలి.

మనిషిగా పుట్టినందుకు, మనిషిగా జీవిస్తున్నందుకు, సాటి మనుష్యులని పొట్టనపెట్టుకునే ఈ యుద్ధాలనీ వాటికి కాలు దువ్వేవాళ్ళనీ శాంతియుతంగా నిరసించటం మనకి అవసరం.

ఇలాటి నిరసనలే వియత్నాం యుద్ధం ఆగటానికి కారణాలయాయి. ఈరోజు ఇరాక్ యుద్ధం కూడా అమెరికన్ నిరసనలకు పెద్ద కారణమయింది.

ఇందాక చెప్పినట్టు, యుద్ధం చేసేవాళ్ళకి రకరకాల కారణాలు వుండవచ్చు. కానీ అసలు కారణమేమిటో మనకి తెలుసు. వాళ్ళకి నిజమైన శత్రువు సాటి సామంతూ కాదు. దేశమూ కాదు.

వాళ్ళ మనసుల్లోనే వున్న దుర్మార్గం. అత్యాశ. దానవత్వం. వాళ్ళు యుద్ధం చేయాల్సింది వాటి మీద. యుద్ధం చేయుటమే కాదు, వాళ్ళు ఆ యుద్ధంలో గెలవాలి కూడాను. అప్పుడే ప్రపంచంలో శాంతి పావురాలు ప్రశాంతంగా ఎగురుతాయి.

0 0 0